సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.25

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.17 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

35.3°/23.6°

జిల్లా పరిధిలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈనెల 17వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఎయిడెడ్, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పరీక్షకు అర్హులన్నారు. అలాగే ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుకుంటూ వసతి సౌకర్యం లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సమరానికి సై..

అనంతలో నేటి నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచులు

- తొలిసారిగా అనంతకు 60 మంది స్టార్ క్రికెటర్ల రాక
- స్పోర్ట్స్18, జియో సినిమా ద్వారా ప్రత్యక్ష ప్రసారం
- నేడు ఇండియా సీ, డీ జట్ల మధ్య మ్యాచ్



దులీప్ ట్రోఫీ మ్యాచులకు సిద్ధమైన ఆర్డీటీ స్టేడియం

అనంతపురం: దేశవాళీ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచులు గురువారం నుంచి అనంతపురంలో జరగనున్నాయి. మొత్తం ఐదు మ్యాచ్‌లు ఇక్కడ నిర్వహిస్తారు. ఇందుకు అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం) సిద్ధమైంది. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు (మల్టీడే మ్యాచ్) జరుగుతుంది. ఇండియా–సీ, డీ జట్ల మధ్య మొదటి మ్యాచ్ గురువారం ప్రారంభం కానుంది. ఇదే సమయంలో బెంగళూరు వేదికగా ఇండియా–ఏ, బీ జట్లు తలపడతాయి. అనంతరం ఈ నెల 22 వరకు నాలుగు టీమ్‌ల మధ్య మ్యాచులు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలోనే జరుగుతాయి. ఇండియా–ఏ జట్టుకు శుభమన్ గిల్, ఇండియా–బీ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్, ఇండియా–సీ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ , ఇండియా–డీ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ టోర్నీలకు విరామం వచ్చినపుడు ఫిట్‌గా ఉన్న స్పెషల్ కాంట్రాక్ట్ ఆటగాళ్లు అందరూ 'దేశవాళీ' క్రికెట్ ఆడాలని బీసీసీఐ నిబంధన విధించిన సంగతి తెలిసిందే. దీంతో స్టార్ క్రికెటర్లు అయిన శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్, రిషబ్ పంత్, శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, అర్షదీప్ సింగ్ వంటి వారితోపాటు మొత్తం 60 మంది దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో పాల్గొంటున్నారు. ఈ మ్యాచ్‌లన్నీ స్పోర్ట్స్ 18, జియో సినిమా ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుండడంతో అనంతకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కనుంది. తొలి రోజు గురువారం ఉదయం 9:30 గంటలకు ఇండియా–సీ, డీ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతించనున్నారు.

4 వేల మందికి ప్రత్యక్ష వీక్షణకు అవకాశం

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాలను అనంత క్రీడాగ్రామంలో ఆర్డీటీ అభివృద్ధి చేసింది. దీంతో దులీప్ ట్రోఫీ మ్యాచుల నిర్వహణకు అవకాశం దక్కింది. స్టేడియంలో 4 వేల మంది ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఒక్క రోజు మ్యాచ్ నిర్వహణకు రూ.కోటికి పైగా నిధులను బీసీసీఐ ఖర్చు చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి స్టార్ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. దాదాపు 500 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు డీఎస్పీలు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నం కానున్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు 30 మంది జిల్లా స్థాయి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మ్యాచ్‌ల వీక్షణకు వచ్చేవారి సౌకర్యార్థం మౌలిక వసతులను ఆర్డీటీ కల్పించింది.

సూర్య దుమ్మా

క్రికెట్ అభిమానులంతా స్కై గా పిలుచుకునే సూర్యకుమార్ యాదవ్ ఇండియా– సీ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. అయితే గురువారం జరిగే మ్యాచ్‌కు అతను గైర్హాజరు కానున్నాడు. తక్కిన మ్యాచ్‌ల్లోనూ ఆడతాడా? లేదా అనే అంశంపై స్పష్టత లేదు. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు నిరాశ చెందారు. సూర్యకుమార్ యాదవ్ కోసం క్యూలో నిల్చొని పాస్‌లు దక్కించుకున్నామని, అతడి ఆటతీరును ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా వారంతా కోరుతున్నారు.

నేడు తలపడే జట్లు ఇవే..

ఇండియా–సీ

రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), బి.ఇంద్రజిత్, హార్దిక్ షోకీన్, మనవ్ సుతార్, ఉమ్రాన్ మాలిక్, వైశాఖ్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్షు చౌహాన్, మయాంక్ మార్కండే, ఆర్యన్ జుయాల్ (వికెట్ కీపర్), సందీప్ వారియర్

ఇండియా–డీ

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అతర్వ టైడ్, యష్ దూబే, దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రికీ భూయి, షరాన్స్ జైన్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, ఆదిత్య థాక్రే, హర్షిత్ రాణా, తుషార్ దేశ్ పాండే, ఆకాష్ సేన్ గుప్తా, కేఎస్ భరత్(వికెట్ కీపర్), సౌరభ్ కుమార్

ఏర్పాట్లు చాలా బాగున్నాయి



మాట్లాడుతున్న శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్

అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం)లో ఏర్పాట్లు చాలా బాగున్నాయని ఇండియా–సీ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఇండియా–డీ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కితాబిచ్చారు. బుధవారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అండర్–16 మ్యాచులు ఇక్కడ ఆడానని, అప్పటికీ, ఇప్పటికీ చాలా తేడా ఉందని, అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నారని శ్రేయస్ అయ్యర్ అన్నాడు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్లు ఈ టోర్నీలో ఆడటం వల్ల యువతలో స్ఫూర్తి నింపినట్లు అవుతుందన్నాడు. దులీప్ ట్రోఫీలో పూర్తిగా మన క్రికెటర్లే ఆడతారని, దీన్ని ప్రత్యేకతగా భావించవచ్చన్నాడు. ఐపీఎల్ వంటి ఇతర టోర్నీలు అయితే విదేశీ క్రికెటర్లు సైతం ప్రాతినిధ్యం వహిస్తారన్నాడు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

- దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు

ప్రశాంతి నిలయం: వరదల్లో సర్వం కోల్పోయిన వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మానవత్వంతో ఆలోచించి వరద బాధితులను ఆర్థికంగా ఆదుకుందామని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో విజయవాడతో పాటు కోస్తాంధ్ర ప్రాంతాల్లో వరదలు ముంచెత్తాయన్నారు. ఎన్నో గ్రామాలు, కాలనీలు వరద విలయంలో చిక్కుకున్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని వారు ధన, ప్రాణ, ఆస్తి నష్టాలతో నిలువ నీడను కోల్పోయారని పేర్కొన్నారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లోని వారికి ఆహారం, దుస్తులు, పునరావాస కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని, ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా చేయి కలిపి సహకరిస్తే అక్కడి ప్రజలు సాధారణ పరిస్థితికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. దాతలు విరివిగా విరాళాలు అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక బ్యాంక్ ఖాతా నంబర్‌తో పాటు, క్యూ ఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. వీటి ద్వారా ఎవరైనా విరాళాలు అందించవచ్చని సూచించారు.

విరాళాలు పంపాల్సిన బ్యాంకు అకౌంట్ నంబర్లు ఇలా....

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
అకౌంట్ పేరు: సీఎంఆర్‌ఎఫ్
అకౌంట్ నం: 38588079208
బ్రాంచ్: ఏపీ సెక్రెటేరియేట్, వెలగపూడి
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0018884

యూనియన్ బ్యాంక్
అకౌంట్ పేరు: సీఎంఆర్‌ఎఫ్
అకౌంట్ నం: 110310100029039
బ్యాంచ్: ఏపీ సెక్రెటేరియేట్, వెలగపూడి
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: యూబిఐఎన్0830798

సీఎస్‌ఆర్(కార్పొరేట్ సామాజిక బాధ్యత) విరాళాలు అందించాలనుకునే వారు కింది ఖాతాకు జమ చేయాలని కోరారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అకౌంట్ పేరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్
అకౌంట్ నం: 00000036897128069
బ్రాంచ్: ఎంజి రోడ్డు, విజయవాడ
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బిఐఎన్0016857

ఈ అధ్యాపకురాలు మాకొద్దు



ఏపీఎంఎస్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

- ఏపీఎంఎస్ ఎదుట విద్యార్థుల ధర్నా
- చితకబాదుతోందంటూ ఆవేదన

చెన్నేకొత్తపల్లి: అకారణంగా చితకబాదుతున్న అధ్యాపకురాలు తమకొద్దంటూ సీకేపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు బుధవారం స్కూల్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ... అధ్యాపకురాలు విజయలక్ష్మి తమను అకారణంగా చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె సొంత పనులన్నీ తమతోనే చక్కబెట్టించుకుంటోందని ఆరోపించారు. తరగతి గదిలో పాఠాలు చెప్పకుండా సమయం వృథా చేస్తుందని, కొన్ని నెలలుగా ఇలాగే ప్రవర్తిస్తుండడంతో విషయాన్ని తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. సమాచారం అందుకున్న సీపీఎం నాయకుడు లింగన్న... ధైర్యం ఇవ్వడంతో ధర్నాకు దిగినట్లుగా తెలిపారు. అధ్యాపకురాలి వైఖరితో స్కూల్‌కు రావాలంటే భయమేస్తోందన్నారు. ఇలాంటి అధ్యాపకురాలు తమకొద్దంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత జోక్యం చేసుకుని విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 7 కిలోల గంజాయి స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వి. రత్న

హిందూపురం అర్బన్: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు సభ్యులు గల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వి.రత్న కేసు వివరాలు వెల్లడించారు. హిందూపురం మండలం గోళ్లాపురం పారిశ్రామిక వాడలో గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న సమాచారం మేరకు హిందూపురం అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులు నేతృత్వంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. గంజాయి విక్రయిస్తున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన (ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న) సుమంత్‌కుమార్ సింగ్, రజ్జిన్, బిహార్‌కు చెందిన దీపక్ కుమార్, కృష్ణారాయ్, సడ్లపల్లికి చెందిన మురళీమోహన్‌రెడ్డి పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి 7 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వివరించారు.

అనుమతించిన వాహనాల్లోనే ఇసుక సరఫరా

- రీచ్, స్టాక్ పాయింట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి
- ఇసుక రవాణాకు రోజుకు 80 వాహనాలకే అనుమతి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: గనుల శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుని, జీపీఎస్ వ్యవస్థ ఉన్న వాహనాలను మాత్రమే ఇసుక రవాణాకు అనుమతించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉచిత ఇసుక రవాణా, విక్రయాలపై బుధవారం ఆయన కలెక్టర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక బుకింగ్, రవాణా వ్యవస్థలను మరింత సులభతరం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇసుక కావాలనుకునే వారు తమ వాహనంలోనూ ఇసుకను రవాణా చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం సమకూర్చిన వాహనంలోనే ఇంటికి డెలివరీ కావాలనుకుంటే, బుకింగ్ సమయంలోనే ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దూరం ఆధారంగా రవాణా చార్జీలను జిల్లాస్థాయి ఇసుక కమిటీ నిర్ణయిస్తుందన్నారు. రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ నెల 6న సచివాలయ సిబ్బందికి ఇసుక బుకింగ్‌పై శిక్షణ ఇవ్వాలని మైనింగ్ శాఖ ఏడీఈని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రవాణా చేసే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్ట్‌ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఇసుక రవాణాకు రోజుకు 80 వాహనాలు మాత్రమే అనుమతించాలన్నారు. సమావేశంలో జిల్లా గనులశాఖ అధికారి రామ్మోహన్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27 మంది టీచర్లకు 'ఉత్తమ' అవార్డులు

- నేడు మంగళకరలో పురస్కారాల ప్రదానం

పుట్టపర్తి: జిల్లాలోని 27 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర కళాశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

అవార్డులు దక్కించుకున్న ఉపాధ్యాయులు..

హెచ్‌ఎంలు: శేషగిరి బాబు(కొండూరు హైస్కూల్, లేపాక్షి మండలం), నరేంద్ర (గౌడనహళ్లి హైస్కూల్, మడకశిర మండలం), కృష్ణానాయక్ (ఎంపీయూపీ స్కూల్, ఇస్లాపురం, పెనుకొండ మండలం)

- **స్కూల్ అసిస్టెంట్లు:** చంద్రమౌళీశ్వర గుప్త (పూలకుంట హైస్కూల్, హిందూపురం) నరసింహ ప్రసాద్ (కొండూరు హైస్కూల్, లేపాక్షి మండలం), సంజీవయ్య (శాంతినగర్ హైస్కూల్, ధర్మవరం), శ్రీనివాసులు (పైడేటీ, హైస్కూల్, పరిగి మండలం), మహ్మద్ ఇసాక్ (బాలుర హైస్కూల్, బుక్కపట్నం), కమలమ్మ (కొట్నూర్ హైస్కూల్, హిందూపురం మండలం), సుధాకర్ (కేశాపురం హైస్కూల్, కొత్తచెరువు మండలం), నాగభూషణ (బత్తలపల్లి హైస్కూల్), మెద్ద రంగప్ప (కె.శివరం హైస్కూల్, మడకశిర మండలం), రామాంజనేయులు (పులమతి హైస్కూల్, లేపాక్షి మండలం), ప్రకాశ్‌రెడ్డి (కోళ్లమర్రి హైస్కూల్, మడకశిర మండలం), రాధ (కగ్రావులపల్లి ఎంపీయూపీ స్కూల్, గోరంట్ల మండలం), సరస్వతమ్మ (పెద్దగువ్వలపల్లి హైస్కూల్, రొద్దం మండలం), రమేశ్‌బాబు (ఎనుములపల్లి హైస్కూల్, పుట్టపర్తి), చంద్రశేఖర్ (బండ్లపల్లి హైస్కూల్, కొత్తచెరువు మండలం)

ఎస్జీటీలు: చంద్రశేఖర్ (నార్శింపల్లి, బుక్కపట్నం మండలం), రామమూర్తి (సూర్యచంద్రాపురం, బత్తలపల్లి మండలం), అరుణ్‌కుమార్ (శివపురం కొట్టాల, కనగానిపల్లి మండలం), రవికుమార్ (గంతపల్లి, మడకశిర మండలం), శివప్రసాద్ (బుల్లసముద్రం, మడకశిర మండలం), సుజాత (వంద్రపాళ్యం, మడకశిర మండలం), శ్రీదేవి (మోదా, పరిగి మండలం), శంకర్ నాయక్ (కోడిపల్లి, లేపాక్షి మండలం), అరుణాదేవి (ముదిగుబ్బ).

డీజేలకు అనుమతి లేదు

- చవితి వేడుకలు శాంతియుతంగా జరుపుకుందాం
- హిందూపురం శాంతికి మారుపేరుగా నిలుపుదాం
- పీస్ కమిటీ సమావేశంలో ఎస్పీ వి.రత్న పిలుపు



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న, చిత్రంలో డీఎస్పీ మహేష్ తదితరులు



సమావేశానికి హాజరైన వివిధ మత కమిటీల పెద్దలు, పట్టణ ప్రముఖులు, పార్టీల నాయకులు

హిందూపురం: వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకూ అందరూ నిబంధనలు పాటిస్తూ హిందూపురం శాంతికి మారుపేరని మరోసారి చాటిచెబుతామన్నారు. వినాయక మండపాల్లో గానీ, నిమజ్జనం శోభాయాత్రలో గానీ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరు హద్దు మీరినా ఉపేక్షించబోమన్నారు. బుధవారం హిందూపురంలోని కేవీఆర్ ఫంక్షన్ హాలులో వివిధ మతాల పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, వినాయక చవితి నిర్వహణ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యేంత వరకూ ప్రత్యేక బృందాలతో పట్టణంలో భద్రతాపరంగా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు పీస్ కమిటీ సభ్యులు, పురప్రముఖులు సహకరించాలన్నారు. వినాయక విగ్రహాలను కూడా నిర్ణీత పరిమితికి మించి ఏర్పాటు చేయకూడదన్నారు. అలాగే పర్యావరణ హితం కోరుతూ అందరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేయాలని సూచించారు. హిందూపురంలో వినాయక మండపాల ఏర్పాటు, నిర్వహణపై ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని, మండపాల నిర్వాహకులంతా ఆ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే నిమజ్జనం సమయంలో సమయపాలన పాటించడంతో పాటు నిర్దేశించిన రూట్‌లోనే గణనాథుల శోభాయాత్ర సాగాలన్నారు. అలాగే ధ్వని కాలుష్యానికి కారకంగా మారిన డీజేలు ఏర్పాటు చేసే బదులు ఆ డబ్బుతో గణేష్ మండపాల వద్ద ఆట పాటలు, వ్యాస రచన, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తే బాగుంటుందన్నారు. మైకులకు అనుమతులు కూడా పోర్టల్ ద్వారానే తీసుకోవాల్సి ఉంటుందని, దానికి కూడా పరిమితులు ఉంటాయన్నారు. ఉత్సవాల సమయంలో గంజాయి, మద్యం ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అనుమతులు..

డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ, దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ అన్ని మతాల వారు కలిసి మెలిసి వినాయక చవితి వేడుకలు జరుపుకుందామని పిలుపునిచ్చారు. వినాయక మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటే.. అన్నీ పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు. వినాయక చవితి పండుగ వేడుకల సందర్భంగా పట్టణంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటామన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే వారు నిర్వాహణ కమిటీని ఏర్పాటు చేసుకుని పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్దన్, వివిధ మతాల పీస్ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ప్రాంతాల పరిశీలన



గుడ్డం కోనేరు పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

హిందూపురం అర్బన్: పట్టణంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే పలు ప్రాంతాలతో పాటు నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర నిర్వహించే రహదారులను ఎస్పీ వి. రత్న బుధవారం పరిశీలించారు. డీఎస్పీ కేవీ మహేష్, పోలీస్ అధికారులతో కలిసి రూట్ మ్యాప్‌పై చర్చించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేయనున్న రహమత్‌పుర, బాలాజీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఆర్‌పీజీటీ రోడ్, అంబేద్కర్‌నగర్‌లతో పాటు కట్టకింద ప్రాంతాల్లో కలియ తిరిగారు. నిమజ్జనం రోజు చేపట్టే భద్రతపై డీఎస్పీ, సీఐలతో చర్చించారు. 18 అడుగులకు మించి ఏర్పాటు చేయనున్న భారీ గణేష్ విగ్రహాల తరలింపు గురించి ఆయా మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. శోభాయాత్ర సకాలంలో సాగేలా సహకరించాలన్నారు. నిమజ్జనం సందర్భంగా గుడ్డం కోనేరు వద్ద తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.